# కల్పన



"ట్రింగ్, ట్రింగ్, ట్రింగ్..." బద్ధకంగా యిటూ, అటూ పక్క మీద దొర్లుతున్న ఆమె విసుగ్గానే ఎడం చేత్తో రిసీవర్ అందుకుంది.

"హలో మిసెస్ రావ్ స్పీకింగ్"

"నేను కల్పనా, భాస్కర్‌ని"

"ఓ. మీరా" భర్తగొంతు విన్నా ఆమె కంఠంలో మార్పురాలేదు.

"ఇవాళ రాత్రి డిన్నర్ వుంది. తొమ్మిది గంటలకి. నీతో చెప్పడంమరిచి పోయా."

".........."

"ఎక్కడ? ఎవరిస్తున్నారని అడగ వేం?"

"మీ రెలాగా చెప్తున్నారుగా!"

"ఒంట్లో బాగుండలేదా కల్పనా?" అతని కంఠంలో ఆతృత.

"బాగానే వుంది."

"తలనొప్పిగా వుంటే ఆస్ప్రో వేసుకో."

"నాకేం తలనొప్పిలేదు."

"అలా అంటే ఒప్పుకోను. డిన్నర్ వేళకి నువ్వు హుషారుగా వుండాలి."

"సరే" ఆమెలో నిర్లిప్తత.

"మంగ్రేకర్ యిస్తున్నాడు డిన్నర్. కంపెనీ డైరెక్టర్స్ యిద్దరు వస్తారు. చాలా యింపార్టెంట్ డిన్నర్ మనకి."

"తొమ్మిదికి కదా?"

"అప్పుడే అయిదయింది. నువ్వు తయారవడం మొదలుపెట్టు. మనం యింటి నించి ఎనిమిదికి బయలుదేరదాం. నేను యింటికి ఏడు గంటలకి వస్తా. ఓకే?"

"ఓకే" కల్పన రిసీవర్ పెట్టేసి, సీలింగ్ వైపు చూస్తూ, ఆలోచిస్తూ పడుకుంది. పావుగంట గడిచాక 'తప్పదు' అన్నట్టు లేచింది. బాత్‌రూమ్‌లోకి వెళ్ళి 'గీజర్' వేసింది.

పడక గదిలోకి వెళ్ళి హౌస్‌కోట్ తీసుకుంది. బీరువాలో బట్టల అడుగున దాచిన విదేశీ సబ్బు తీసుకుని, తువ్వాలు భుజంమీద వేసుకుని, స్నానాలగదికి దారి తీసింది. కొళాయి తిప్పి వేడినీళ్ళు బాల్చీలో నింపింది.

ఆమె బయటికి వచ్చి తల తుడుచు కుంటూ వుంటే కాలింగ్ బెల్ మ్రోగింది.

"నమస్తే"

"నమస్తే. రండి, రండి" అంది కల్పన, తలుపుతీసి. వచ్చిన వ్యక్తిని చూడగానే అప్పటిదాకా ఆమెలో వున్న బద్ధకం, విసుగూపోయి వుత్సాహం, ఆనందం వెల్లివిరిసాయి. ఆమెకళ్ళు మెరిసాయి. ముఖం విచ్చుకుంది. చిరు నవ్వు పెదవులమీద నాట్యం చేసింది.

"భాస్కర్ రాలేదా?" అంటూ మోహన్ లోపలికి వచ్చి వీధి తలుపు వేసాడు. "వుహుఁ, యింకో గంటదాకా రారు. రండి మనం బెడ్‌రూమ్‌లో కూచుని మాట్లాడుకుందాం. నాకొంచెం పనివుంది" అంది కల్పన.

అతను సంకోచిస్తూ ఆమె వెంట నడి చాడు. పడక గదిలో ఓ పక్కగా డ్రస్సింగ్ టేబిల్ వుంది.

"మీరా పక్కమీద కూచుంటారా? కుర్చీ తీసుకురానా?" అంది కల్పన సీలింగ్‌ఫాన్ వేస్తూ.

అతను బెడ్ వైపు చూసాడు. అప్పటి దాకా ఎవరో పడుకున్నట్టు నలిగివుంది.

"కుర్చీ తెచ్చుకుంటా" అని మోహన్ వెనక వరండాలో వున్న గార్డెన్ ఛైర్ ఒకటి తెచ్చుకున్నాడు.

కల్పన డ్రస్సింగ్ టేబిల్‌ముందు స్టూల్‌మీద కూర్చుంది. ఆమె ప్రతి బింబం ముందువున్న మూడు నిలువు టద్దాలలోంచి, మూడు కోణాల్లో కని పిస్తోంది.

కల్పన వంగి నైల్‌పాలిష్ సీసాలు పరిశీలిస్తోంది. తెల్లటి టర్కిష్ టవల్ ఆమె వీపుని కప్పి వుంది. దాని మీద మరీ పొడుగుకాని వత్తైన నల్లటి జుత్తు పరుచుకునుంది. క్రిందికి వాలిన ఆమె కళ్ళు ముడుచుకున్న కలువరేకులలా వున్నాయి. ఆమె పెదవులు అప్పుడే విచ్చుకుంటున్న గులాబీ రేకులలా వున్నాయి.

ఆమె స్నానానికి వాడిన సబ్బు మహిమ కావచ్చు - చక్కటి పరిమళం గదంతా వ్యాపించింది. మోహన్‌కి ఒక్కసారి ఆమెని ముట్టుకోవాలనీ, వత్తైన ఆమె జుత్తుని రెండుచేతులతో ఎత్తి వాసన చూడాలనీ అనిపించింది.

"మోహన్, ఒక్కసారి యిలా వస్తారా ? ఏ రంగు వేసుకోమంటారు ?"

"అలాంటివి నాకేం తెలియవు."

"ఈ లైట్ ఆరెంజ్ బాగుంటుందా ?" ఆమె వేలికి వేసుకుని చూపింది.

అతను ఒక్కసారి పరిశీలనగా ఆమె వేలు చూసాడు.

"వుహుఁ"

"ఈ రెడ్ ?"

"వుహుఁ"

"గులాబీ ?"

"వుహుఁ, నేచురల్ కలర్ వుంటే వేసుకోండి."

కలర్ రిమూవర్‌తో గోళ్ళు శుభ్రపరచుకుని నాచురల్ కలర్ వేసుకుని, కల్పన చేతి వ్రేళ్ళని చూసుకుంది. చాలా పొందికగా, అందంగా వున్నాయి ఆమె చేతులు. సన్నని పొడవైన వ్రేళ్ళు. చక్కగా పెంచిన గోళ్ళు. నాజూకుగా వున్న ఆమె చేతిని ఒక్కసారి ముట్టుకుని వదిలితే ! ! మోహన్ తలప్రక్కకి తిప్పుకున్నాడు.

"ఏమైనా మాట్లాడండి. ఏమిటంత మౌనంగా కూర్చున్నారు ?" చేతిలోకి బ్రష్ తీసుకుని తలదువ్వుకుంటూ అతని వైపు తిరిగింది కల్పన.

"ఇంత హడావిడి చేస్తున్నారు, ఏమిటీ రోజు విశేషం ?"

"మాకు విశేషాలు ఏమున్నాయ్ ? రాత్రి డిన్నర్" హఠాత్తుగా ఆమెలో నీరసం ఆవహించింది.

"అదా సంగతి ! ఎవరిస్తున్నారు ?"

"ఎవరో ఓ పనిలేని మంగళి."

"మీ రలా కొట్టిపారేయకండి. స్వలాభం లేనిదే కంపెనీ వాళ్ళు పార్టీలు, డిన్నర్లూ యివ్వరు. వాళ్ళ ప్రతి కదలిక వెనక ఏదో స్వార్థం వుంటుంది."

ఆమె కాస్సేపు మౌనంగా ఎక్కడికో చూస్తూ వుండిపోయింది. "వుండండి, కాఫీచేసి తీసుకువస్తా" అంది చివ్వున లేస్తూ.

అతను "ఫిలిమ్ ఫేర్" తిరగేస్తూ కూర్చున్నాడు. "కాఫీ తీసుకోండి" అంది కల్పన పదినిమిషాలలో తిరిగి వచ్చి. భర్త భార్యనూ, భార్య భర్తనూ ప్రేమించి తీరాలంటారా ?" ఆమె అతని ఎదురుగా స్టూల్‌మీద కూచుని, అతని కళ్ళల్లోకి చూస్తూ ప్రశ్నించింది.

మోహన్ తడబడ్డాడు. "అదేం లేదు. కాని అనుదిన సాహచర్యంవల్ల భార్యాభర్తలలో అనుకోకుండానే ఒకరి మీద ఒకరికి అభిమానం ఏర్పడుతుంది అనుకుంటా."

"అలా ఏర్పడనపుడు వాళ్ళిద్దరూ దూరం కావచ్చంటారా ?"

"మానసికంగా దూరం కావచ్చును."

"శారీరకంగా దూరం కాలేరంటారు ?"

మోహన్ నవ్వి వూరుకున్నాడు.

"భర్తమీద భార్యకి అయిష్టత ఏర్పడినప్పుడు అతనితో కాపరం చేసేకంటే విడిపోవడం వుత్తమం కదూ ?"

ప్రసంగం కల్పన ఎటువైపు నడిపిస్తోందో గ్రహించాడు మోహన్. ఏదో ఒకరోజు యీ ప్రసంగం వస్తుందని అతనికి తెలుసు.

"మన సంఘంలో అదంత సులభం కాదు, తొందరగా సాధ్యంకాదు."

"ఎందుకు సాధ్యం కాదు మోహన్ గారూ ? ఈ సంఘం మనం సృష్టించినదే కదా ? వ్యక్తి సుఖంకోసం, రక్షణకోసం మనం కొన్ని నీతులూ, సూత్రాలూ ఏర్పరచుకున్నాం. కాని ఆ కట్టుబాట్లు కావలసినపుడు మనం సడలించుకోవాలి. వ్యక్తి స్వాతంత్ర్యం, సుఖం సంఘం కట్టుబాట్లకి నలిగిపోకూడదు."

మోహన్ మాట్లాడలేదు.


"ప్రతి క్షణం సంసారంలో నరకం అనుభవించేకంటే ఆ కాపరం విచ్చిన్నం చేసుకోవడం తెలివైన పని." తిరిగి కల్పనే అంది. ఉద్రిక్తతవల్ల ఆమె కంఠం వణికింది.

"మీరిప్పుడు యిలాంటి ఆలోచనలు ఎందుకు పెట్టుకుంటున్నారు ?" అతని ప్రశ్న విని ఆమె ఆశ్చర్యపోయింది. గబుక్కున లేచి అతని ఎదురుగా వచ్చి నిలుచుని, అతని రెండు భుజాలమీదా చేతులువేసి, ముఖంలోకి సూటిగా చూస్తూ "మోహన్‌గారూ, ఎన్నాళ్ళీ నాటకం ? మీరు నన్ను ప్రేమించటం లేదా ? నిజం చెప్పండి" అంది కల్పన.

అతను తడబడ్డాడు. ముఖం ఎర్రబడింది.

"నిజాన్ని ఒప్పుకోడానికి ఎందుకు భయపడతారు ? మీరు అందరిలాంటివారు కారు. అంతా నా శరీరాన్నే ప్రేమిస్తారు. వాళ్ళకి నా అందమే కావాలి. కాని మీరలా కాదు."

మోహన్ నవ్వేసాడు. ఆ గంభీర వాతావరణాన్ని మార్చాలని అతని ప్రయత్నం.




"నేను మీ శరీరాన్ని ప్రేమించటం లేదని ఎందుకనుకుంటారు ?" అతని భుజం మీదినించి చేతులు తీసేసింది కల్పన. తిరిగి వెళ్ళి డ్రస్సింగ్ టేబిల్ ముందు కూర్చుంది.

"మీరు నా శరీరాన్ని మాత్రం ప్రేమిస్తున్నారంటే నేను నమ్మను. రెండేళ్ళనించీ మనకి స్నేహం వుంది. మీకు నాతో లభించినంత ఏకాంతం, అవకాశం యింకెవరికీ లభించి వుండవు. కాని మీరు ఒక్కసారి కూడా నా దగ్గిరికి రావాలని కాని, నన్ను తాకాలని కాని, అతి చనువు తీసుకోవాలని కాని ప్రయత్నించలేదు. అందుకే మీరంటే నా కిష్టం."

మోహన్ కుర్చీలో యిబ్బందిగా కదిలాడు.

"భాస్కర్ వచ్చే వేళైనట్టువుంది" అంటూ కిటికీ దగ్గిరకి వెళ్ళి బయటికి చూస్తూ నుంచున్నాడు.

అతను ఆమెకి అద్దంలోంచి కనిపిస్తున్నాడు. సిగలో పిన్నులు గుచ్చుకుంటున్నామె, ఒక్కసారి ఆగి, అతనిని తదేకంగా చూస్తూ,

"ఎందుకు నిజాన్నించి తప్పించుకోవాలని చూస్తారు మోహన్‌గారూ ?" అంది కల్పన.

మోహన్ మాట్లాడలేదు. అతనివెనక భాగంమాత్రం కనిపిస్తోంది ఆమెకి. అతని ముఖంలో భావాలని చూడలేక పోయింది.

సిగలో పిన్నులన్నీ గుచ్చుకుని, లేచి అతని దగ్గిరగా వచ్చి, "నేను మీతో వచ్చేస్తాను. తీసుకుపోతారా ?" అంది లాలనగా.

"లాభంలేదు కల్పనా ! అలాంటి ఆలోచనలు వ్యర్థం" అంటూ అతను నిట్టూర్చాడు.

ఆమె నిరాశగా ప్రశ్నార్థకంగా చూసింది.

"నేను ఏడాదినించీ ఆలోచిస్తున్నా కల్పనా. మీరు సామాన్యంగా వుంటే, యింత అందంగా వుండి వుండకపోతే, ఏనాడో మిమ్మల్ని ఎక్కడికో తీసుకుపోయి వుండేవాడిని."

"లోకమంతా వాంఛించే నా అందం మీకు చేదైందా ?" కిలకిలా నవ్వింది కల్పన.

అతను నవ్వలేదు. 'నీ అందం నాకు చేదుకాదు కల్పనా ! అందరికంటె దాన్ని నేనే ఎక్కువ వాంఛిస్తున్నాను. నీ అందం అందరి కళ్ళలో పడి మాసిపోకుండా, నా దగ్గిర భద్రంగా దాచేసుకోవాలనుకుంటున్నాను' అనుకున్నాడు మనసులో.

"మాట్లాడరేం మోహన్ ?"

"ఏం మాట్లాడను ? మీ అందచందాలు ఎంతో ప్రసిద్ధి కెక్కినవి. మీ ఆయనకి హోదా, ధనవంతులలో పలుకుబడీ వుంది. మీ పరిచయస్థులు దేశమంతా వున్నారు. మిమ్మల్ని నేను ఎక్కడికి తీసుకుపోను ?"

"నన్ను తీసుకువెళ్ళడానికి మీకు అనువైన స్థలమే లేదా ? ఈ విశాల దేశంలో ఏ మారుమూల పల్లెకి వెళ్ళినా మనం హాయిగా వుండగలం మోహన్."

"ఏం పెట్టుకుని హాయిగా వుండగలం ? మారుమూలపల్లెలో నాకేం వుద్యోగం వస్తుంది ? మనిద్దరం హాయిగా గుడిసె వేసుకుని ఎంకీ, నాయుడు బావలలా వుందామనుకుంటున్నారేమో ! అవన్నీ పిచ్చివూహలు. పేదరికాన్ని,

శరీరశ్రమనీ భరించడం కష్టం. మనం హాయిగా వుండలేం."

కల్పన నిరాశగా వెళ్ళి పక్కమీద కూచుంది. నిరాశస్థానే ఆమెలో కళ్ళలో క్రమంగా ఏదో కసి చోటుచేసుకుంది.

"అయితే యిన్నాళ్ళనించీ యిక్కడికి ఎందుకు వస్తున్నట్టు మోహన్ ? నాలో లేనిపోని ఆశలు ఎందుకు సృష్టించాలి ? తక్షణం యిక్కడినించివెళ్ళిపోండి. ఇంక మీ ముఖం నాకు చూపవద్దు." ఆమె గుమ్మంవైపు వేలుచూపుతూ గట్టిగా మాట్లాడింది.

మోహన్ బాధగా చూసాడు. మెల్లిగా నడిచి వచ్చి, కల్పనముందు ఒక క్షణం ఆగాడు. "క్షమించండి. నేను పిరికి వాడిని." అన్నాడు.

కల్పన ముఖం ప్రక్కకి తిప్పుకుంది. అతని పాలిపోయిన ముఖం చూసివుంటే, అతని కళ్ళలోని అంతులేని వ్యధను చదివి వుండగలిగేదామె.

మోహన్ తలుపు తీసుకుని బయటికి వెళ్ళిపోయాడు. ఆమెలోని దుఃఖం కన్నీటిప్రవాహంగా ముందుకు దూకింది.

భాస్కర్ వచ్చేవరకూ ఆమె ఏడుస్తూనే వుంది.

భాస్కర్ భార్యని చూసి తెల్లబోయాడు.

"ఎందుకేడుస్తున్నావ్ ?" అన్నాడు. అది గద్దింపులాగే వినబడింది కల్పనకు. ఆమె ముఖం ఎత్తలేదు. ఏడుపు మానలేదు.

అతను చిరాకుపడ్డాడు. విసుక్కున్నాడు. టైమ్‌చూసుకున్నాడు.ఏడున్నర ఇంకో అరగంటలో బయలుదేరకపోతే తాము బొంబాయిలాంటి వూళ్ళో ట్రాఫిక్ సిగ్నల్స్ నించి తప్పించుకుని 'హోటెల్ తాజ్' చేరలేరు. ఈ రోజు డిన్నర్‌కి వెళ్ళకపోతే...? ఇంతమంచి ఛాన్సు మళ్ళీ యిప్పట్లో రాదు.

పొంగివస్తున్న కోపాన్ని గొంతుకలోనే దిగమింగేసాడు భాస్కర్. ఒక్క నిమిషంలో ముఖంలో ప్రసన్నత కొని తెచ్చుకున్నాడు.

"ఏమిటి కల్పనా, ఎందుకీ ఏడుపు ? నాతో చెప్పవ్ ?" అన్నాడు భాస్కర్ భార్య ప్రక్కన కూచుని, ఆమెభుజం చుట్టూ చెయ్యివేసి దగ్గరకు తీసుకుంటూ.

అతనిచెయ్యి ఆమెకు పాములా తోచింది. తీసిపారేసింది.

"ఇంత అలకకూడదు డార్లింగ్. నా చిట్టివికదూ, ఎందుకు ఏడుస్తున్నావో చెప్పవూ ? నీమాట ఎప్పుడన్నా నేను కాదన్నానా ? నీకేమిటి తక్కువ ? నీకేం కావాలో చెప్పు. ఇప్పుడే తెస్తా. అసలు ఒంటరిగా కూచుని పిచ్చిపిచ్చి ఆలోచనలు పెట్టుకుంటావ్. అలా మధ్యాహ్నం సినిమాకో,షాపింగుకోవెళ్ళిరాకూడదూ?" అంటూ బుజ్జగించాడు.

ఆమెకు తెలుసు. అతను తను లేచేదాకా అలా ప్రేమనటిస్తూనే వుంటాడు. అతనికి కావలసింది ఏమిటో చివరికి సాధించగలడు.

"అలా మంచిపిల్లలా ఏడుపు మానెయ్యాలి" అన్నాడు భాస్కర్ మెచ్చుకుంటూ.

కల్పన కళ్ళు తుడుచుకుని లేచింది. అతనివేపు ఒకమారు అసహ్యంగాచూసి, బాత్‌రూమ్‌లోకి వెళ్ళింది. మొహం కడుక్కునివచ్చి, స్నో, పౌడర్ దిట్టంగా పట్టించి మేకప్ అయింది.

ఆమె లిప్‌స్టిక్ వేసుకుని తయారయ్యేసరికి భాస్కర్ బీరువాలోంచి ఆమె కట్టుకోవడానికి చీర, జాకెట్ తీసిపెట్టాడు. ఎర్రటి, పల్చని షిఫాన్‌చీర, చేతులులేని జాకెట్. ఆమె మౌనంగా ధరించింది

"అరె ! నెక్లెస్ పెట్టుకోలేదా ?" అంటూ గాడ్రెజ్ బీరువాలోంచి కెంపుల నెక్లెస్ తీసి ఆమె మెడలో పెట్టాడు. ఆమె మంగళసూత్రాలు తీసేసి హాండ్ బాగ్‌లో పడేసింది. నెక్లెస్‌తో మంగళసూత్రాలు వేసుకుంటే మోటుగావుంటాయంటాడతను. మంగళసూత్రాలు తీయడానికి ఆమె ప్రతిసారీ ప్రతిఘటించేది. కానియీసారి అవితీసేస్తూవుంటేమనసుకు బాధ అనిపించలేదు.

భాస్కర్ భార్యని నఖశిఖ పర్యంతం చూసాడు. అతని కళ్ళలో అసంతృప్తి వెలిసింది. కల్పన కళ్ళు రెండూ జపాపుష్పాలలా ఎర్రగా వాచివున్నాయి. ఆమెలో జీవకళ లేదు. ఆమె నవ్వుతూ హుషారుగా వుంటే ఎరుపు కనిపించదు. కాని ఎలా నవ్వుతుంది ? ఆమె 'మూడ్' మార్చడం ఎలా ? – ఇంకా కారులో గంట టైమ్ వుందిగా – అనుకున్నాడు భాస్కర్.


అతను తయారై కారుతాళాలు తీసుకుని వచ్చేసరికి ఆమె నిర్లిప్తంగా అలాగే కూచుని వుంది.

"అలా 'మూడీ'గావుండకు డియర్" అంటూ ఆమెని దగ్గిరికి తీసుకుని మెల్లిగా పెదవులమీద, కళ్ళమీద ముద్దుపెట్టుకున్నాడు. ఆమె వెంటనే పెదవులు రుమాలుతో తుడుచుకుంది.

"అరెఃగట్టిగా తుడుచుకోకు, లిప్‌స్టిక్ చెరిగిపోతుంది" అంటూ హాస్యమాడుతూ ఆమె నడుంమీద చేయివేసి, ఆమెని కారు దగ్గిరికి నడిపించాడు భాస్కర్.

ఓ గంట తరవాత ఎఱ్ఱ షిఫాన్ చీరతోపాటు ఓ మెరుపుతీగ 'హోటల్ తాజ్' ని ప్రవేశించినట్లు అక్కడ చేరిన అతిథుల కళ్ళన్నీ కుతూహలంగా గుమ్మంవైపు తిరిగాయి.

"హలో బేబీ, హలో రావ్" అంటూ కంపెనీ జనరల్ మేనేజర్ మంద్రేకర్ ముందుకు వచ్చి దంపతులని ఆహ్వానించాడు. భాస్కర్‌తో షేక్‌హాండ్‌చేసి వదిలి, కల్పన చెయ్యి అందుకుని తన చేతిమధ్య యిరికించుకున్నాడు. మంద్రేకర్ వయస్సు యాభై దాటింది.




"హలో మిసెస్ రావ్, హలోకల్పనా, హౌ డు యు డూ ?" పరిచయస్థులంతా ఆమెచుట్టూ చేరారు.

"థాంక్యూ. ఫైన్, హౌడుయుడూ?"

ఒకసారి చూస్తే, మళ్ళీ మళ్ళీ తిరిగి చూడాలనిపించే అందం కల్పనది. మల్లె పూవులాంటి తెలుపురంగు శరీరం. ముట్టుకుంటే మరక పడుతుందేమోనని పిస్తుంది. నాజూకుగావున్న పొడవైన విగ్రహం. ఎఱ్ఱటి షిఫాన్ చీరలోంచి ఆమె వంపులన్నీ అతిజాగ్రత్తగా దాచిన సొంపులలా కనిపిస్తున్నాయి. ఎత్తైన వక్షస్థలం, గుండ్రంగావున్న భుజాలు, సన్నటి నడుమూ ప్రతిమగవాడి చూపులనూ మత్తెక్కిస్తాయి. స్త్రీలలో యీర్ష్య పుట్టిస్తాయి.

"అదుగో డైరెక్టర్స్ వచ్చారు" అన్నారెవరో హడావిడిగా.

మంద్రేకర్ కల్పన చెయ్యి పట్టుకునే ముందరికి చకచక నడిచాడు. "కమిన్ మిస్టర్ డాంగే, వెల్‌కమ్ మిస్టర్ పటేల్"

డైరెక్టర్స్ యిద్దరూ నడివయస్సు దాటినవాళ్ళే.

"మీట్ మిసెస్ రావ్" అంటూ కల్పనని పరిచయం చేశాడు. కల్పన నమస్కరించింది. ముసలివాళ్ళిద్దరి కళ్ళలోకి ఒక్కసారి యవ్వనం తోసుకువచ్చింది.

డ్రింక్స్ వచ్చాయి. అందరూ 'సిప్' చేస్తూ గుంపులు గుంపులుగా నుంచుని మాట్లాడుకుంటున్నారు. కల్పనకి ఓ 'గుక్క' 'రసం' పడగానే హుషారు వచ్చింది నవ్వుతోంది. భాస్కర్ దూరంగా ఉండి భార్యను గమనిస్తున్నాడు. ఆమెలో మార్పు వచ్చినందుకు సంతోషించాడు. ఒకసారి ఆమె మంచి 'మూడ్'లోకి వస్తేచాలు—తన కళ్ళ కదలికతో, పెదవులమీది చిరునవ్వుతో ఎవరినైనా పట్టేయగలదు. ఆమె నవ్వు అనే సమ్మోహనాస్త్రాన్ని వదిలి ఎవరినైనా దాసానుదాసులుగా చేసుకోగలదు.

ఎవరోవచ్చి కల్పన ఖాళీగ్లాసుని నింపుతున్నారు. ఆమె నవ్వుతూ థాంక్స్ చెపుతోంది. భాస్కర్‌కి ఆశ్చర్యంగా వుంది. కల్పన ఒక గ్లాసే పూర్తిగా ఎప్పుడూ తాగదు.

కల్పన అదీముగించి, మూడోగ్లాసు నింపుకుంటోంది. భాస్కర్ కళ్ళు చిన్నవి చేసుకు చూశాడు. ఆమె హుషారుగా తిరిగినకొద్దీ ఆమెచుట్టూ ఆరాధకులు ఎక్కువౌతున్నారు. వాళ్ళలో డైరెక్టర్స్ మంద్రేకర్ ప్రథములు.

డ్రింక్స్ ముగిసాయి. విందుభోజనానికి టేబిల్స్ దగ్గర సర్దుకుంటున్నారు. "బేబీ కమాన్" అంటూ మంద్రేకర్ కల్పన భుజంమీద చెయ్యివేసి టేబిల్ దగ్గరికి నడిపించుకు వెళ్ళాడు. భాస్కర్ కూడా వాళ్ళతోపాటు నడిచాడు. కాని అప్పటికే యిద్దరు డైరెక్టర్సు, మంద్రేకర్, కల్పన నాలుగు కుర్చీలున్న టేబిల్ దగ్గిర సర్దుకున్నారు.

కల్పన ఒకసారి తలఎత్తి భర్త ముఖంవైపు చూసి నవ్వింది. ఆ నవ్వు చూసి అతడు ఆనందించలేదు. చేసేదిలేక పక్క టేబిల్ దగ్గిర కూర్చున్నాడు.

సన్నగా సంగీతం వినిపిస్తోంది. డ్రింక్స్ సేవించినప్పటిలా అందరూ గట్టిగా మాట్లాడుకోవటంలేదు. భోజనం బల్లల దగ్గిర చాలా మెల్లిగా సంభాషణ జరుగుతోంది.

కల్పనావాళ్ళ మాటలుకూడా వినిపించటంలేదు. మధ్యమధ్యలో వాళ్ళ నవ్వులు వినిపిస్తున్నాయి. కల్పన యీరోజు కొంచెం శ్రుతిమించి నవ్వుతోంది. ఆమె నవ్వు చుట్టుప్రక్కల పారిని మాట

మాటికీ ఆకర్షిస్తోంది. ఆమె అలా ఓసారి నవ్వుతున్నప్పుడే ఒళ్లోవేసుకున్న తెల్ల నాప్‌కిన్ క్రింద జారిపోయింది. అది తీసుకుందామని ఆమె వంగింది. ఆమెతో పాటు సన్నటి పైటకూడా క్రిందకి జారింది. ఎర్రటి లోకట్ జాకట్టులోంచి తెల్లటి ఆమె గుండెలు తొంగిచూసాయి. కల్పన మెల్లగాలేచి నిర్లక్ష్యంగా పైట వేసుకుంది. అంతవరకూ తక్కిన ముగ్గురు పురుషుల చూపులూ ఆమె గుండెలమీదే నిలిచాయి.

భాస్కర్రావుకి భార్య ప్రవర్తన చాలా వింతగా కనిపించింది. కోపంగా 'స్టుపిడ్' అనుకున్నాడు లోలోపల. తన ప్రమోషన్స్‌కి ఆమెఅందాన్ని ఓ'మెట్టుగా పెట్టుకోవాలనుకున్నాడు. కాని భార్యని వేశ్యగా మార్చాలని ఎప్పుడూ అనుకోలేదు. అతనికి విందుభోజనం చేదుగా మారింది.

ఇంటికివస్తూ కారులోకూడా అతడు పళ్ళు పటపట లాడించాడు. కాని కల్పన మాత్రం చాలా హుషారుగావుంది. కిటికీ మీద తల వంచి సన్నగా యింగ్లీషు పాట కూనిరాగం తీస్తోంది. ఆ పాట వింటూ వుంటే అతనికి భార్యని హత్యచెయ్యాలన్నంత కోపం వస్తోంది.

ఇల్లుచేరగానే అతను విజృంభించాడు.

"ఎందుకా కక్కుర్తి ! రోజూ డ్రింక్స్ అలవాటైనట్లు ఆ తాగడం ! మూడు గ్లాసులు తాగావు."

ఆమె బట్టలస్టాండు మీదినుంచి నైట్ గౌన్ తెచ్చుకుంటూ "అయితే నేను ఎన్ని గ్లాసులు త్రాగానో చూశారన్నమాట !" అంది నిర్లక్ష్యంగా.

"ఆఁ. అలా తప్పతాగుతూవుంటే చూసినవాళ్ళు ఏమనుకుంటారు ? ఆడది అలా తాగితే ఎంత అసహ్యంగా వుంటుంది ?"

ఆమె మాట్లాడలేదు. మౌనంగా చీరా, **జాకెట్టూ...ఒకటొకటే విప్పి పడేసింది.**

అతనికి తల తిరిగినట్టయింది – ఆమె అలా నగ్నంగా తయారవుతూవుంటే. పెళ్ళయిన యీ అయిదేళ్లలో కల్పన ఎప్పుడూ అలాచెయ్యలేదు. ఆమెకి చాలా సిగ్గు. ఇవాళ ? ఈట్యూబ్‌లైట్ కాంతిలో?

"ఛీ. సిగ్గు వెయ్యటంలేదూ ?"

"ఎందుకు సిగ్గు ? పెళ్లయి, అయిదేళ్లయి, కాపురంచేస్తున్న నా భర్తదగ్గిర నాకెందుకు సిగ్గు ?" ఆమె నైట్‌గౌన్ వేసుకుంటూ అతనివైపు తిరిగింది.

నల్లటి పల్చటి నైట్‌గౌన్‌లోంచి పాల రాతి విగ్రహంలాంటి ఆమె శరీరం ! గౌను ముందుభాగంలో బొత్తాలింకా పెట్టుకోకపోవడంవల్ల మధ్య ఖాళీఏర్పడి ఎత్తుపల్లాలు తొంగిచూస్తున్నాయి. ఆమెని అలా చూస్తూంటే భాస్కర్‌కి మతిపోయినట్టయింది. మాట్లాడుతున్న విషయం, కోపం కాస్సేపు మర్చిపోయాడు.

"పడుకుందామా ? అంది కల్పన." ఆమె పెదవులమీద కొంటెనవ్వు.

అతనిలో మళ్ళీ కోపం తలఎత్తింది.

"ఏమిటీ భోగం వేషాలు?"

"నేనేం భోగం వేషాలు వేశాను?" ఆమె దెబ్బతిన్నట్టు చూసింది.

"పైట వంటిమీద వున్నదీ లేనిదీ తెలియటంలేదా ?"

"ఓ...అలాచేస్తే మీకింకా యిష్టమౌతుంది అనుకున్నా"

"ఛీ. ఏం మాట్లాడుతున్నావ్ ? నా కిష్టమౌతుందా ?"

"ఏమో ! నా అందం ఎరగా చూపే కదా మీరు ప్రమోషన్స్ తెచ్చుకుంటున్నారు. నా అందాలు యింకా బాగాచూపి ఆ ముసలివాళ్లను 'ప్లీజ్' చేస్తే మీకింకా చాలా పెద్దపదవి వస్తుందేమో అనుకున్నాను."

భాస్కర్ కళ్లు చిన్నవి చేసుకుని, ఆమెవైపు వుక్రోషంగా చూసాడు.

"నేను నా భార్యని వేశ్యగా మార్చాలని ఎప్పుడూ అనుకోలేదు."

"మరి మీరు చేస్తున్నదేమిటి ?"

"నిన్నెప్పుడూ ఒక లిమిట్‌లోనే వుంచాను. నువ్వు అందంగా వుంటావనీ, సరదాగా మాట్లాడతావనీ – వాటిద్వారా సంఘంలో పేరూ, నాకు పలుకుబడీ హెచ్చాలని అనుకున్నాను."

"మీరు ఏ లిమిట్‌లో వుంచారు ? మంగ్రేకర్ లాంటివాళ్లకు ఎక్కడినించి వచ్చిందంత ధైర్యం – నా భుజంమీద చెయ్యి వెయ్యడానికి ? నా భర్త ఎదురుగా వుండగానే అడ్డమైనవాడూ నా చెయ్యి ముట్టుకుంటాడు. కారణం ఏమిటి? మీరిచ్చిన అలుసేగా !" ఆమె కళ్ళలో ఎర్రజీరలు వ్యాపించాయి.

కల్పన మాటలు ప్రవాహంలా ముందుకు వురుకుతున్నాయి. "నన్ను వేశ్యగా మార్చలేదన్నారు నాకూ, వేశ్యకీ తేడా ఏమిటి ? వేశ్యలాగే నేనూ నా అందం, నా వయ్యారం చూపి అందరినీ ఆకర్షించాలి. వేశ్యతో శారీరక సంబంధంవుంటే, నాతో యీ పురుష పుంగవులంతా మానసికంగా వ్యభిచరిస్తారు. కాదంటారా ? వేశ్యకి డబ్బు ముడితే, నాభర్త ప్రమోషన్‌ల రూపంలో నాకు బహుమతులందుతాయి. ఇంక మా యిద్దరికీ భేదం ఎక్కడ ?"

భాస్కర్ పరాభవం పొందినవాడిలా కోపంగా చూస్తూ నుంచున్నాడు.

"ఇన్నాళ్ళుగా మీరు మీ యిష్టంవచ్చినట్లు మీ స్వలాభంకోసం నన్ను వాడుకున్నారు. మానసికంగా, శారీరకంగా నాకో నరకం చూపారు. ఇక మీ ఆటలు సాగవు. నాయిష్టంవచ్చినట్లు నేను ప్రవర్తిస్తా". కల్పన క్రిందపడేసిన చీరా, తక్కిన బట్టలూ వుండచుట్టి కోపంగా మూలకు విసిరేసి, పక్కమీదికివెళ్ళి పడుకుంది. ముఖం తలగడలో దాచుకోవడం వల్ల, ఆమె ఏడుస్తోందో, వూరికినే పడుకుందో తెలుసుకోలేక పోయాడు భాస్కర్.

అతనికంతా అయోమయంగా వుంది. ఇన్నాళ్లుగా సాగిన తన పథకాలు యీ రోజు యిలా ఎదురు తిరగడం, భార్య తనమీద యుద్ధం ప్రకటించడం, కోపాన్ని తెప్పించాయి. హఠాత్తుగా అతనికి భార్యంటే ఎందుకో భయం కలిగింది.

## 2

మధ్యాహ్నం రెండుగంటలై వుంటుంది. కల్పన పడుకుని పుస్తకం తిరగేస్తూంది. కాలింగ్ బెల్ మ్రోగింది. వంటింట్లో గిన్నెలు కడుగుతున్న సక్కుబాయి వెళ్లి తలుపు తీసింది

"భాయిజీ! సాబ్ ఆయా!" అంది కల్పన గదిలోకి వచ్చి.

"కౌన్‌సా సాబ్?"

"మోహన్ సాబ్! డ్రాయింగ్ రూమ్ మే బైఠా హై"

కల్పన ముఖం చిట్లించుకుని 'ఠీక్ హై' అంది. సక్కుబాయి వంటింట్లోకి వెళ్లి పోయింది.

మోహన్ మళ్ళీ ఎందుకు వచ్చినట్లు? అయిష్టంగానే లేచింది కల్పన.

"నమస్తే" మోహన్ మామూలుగానే వున్నాడు. ఆమె రాగానే లేచి నిలుచున్నాడు.

కల్పన మౌనంగా వెళ్లి సోఫాలో కూర్చుంది. అతను ఆమెకి ఎదురుగా కూర్చున్నాడు. ఆమె మాట్లాడలేదు.

"మళ్ళీ ఎందుకు వచ్చారు?" సూటిగా చూస్తూ ప్రశ్నించింది.

''నిన్నరాత్రంతా ఆలోచించాను" అని ఆగాడు మోహన్.

"మీరు నాతో వచ్చేస్తానన్నారుగా?"

కల్పన ముఖం కందగడ్డలా తయారయింది. "ఏం, తీసుకువెళదామని వచ్చారా? ఇక్కడెవరూ మీతో రావడానికి తయారుగా లేరు."

"మీరలా అంటారని నాకు తెలుసు. ఆమాటే చెప్పాలని వచ్చాను. మీరు యీ యిల్లు వదలి ఎక్కడికీ ఎవరితోనూ వెళ్ళిపోలేరు."

"ఏమిటి మీ వుద్దేశ్యం?"

"నిజం కల్పనా. మీకు భాస్కర్ అంటే మనసులో యిష్టమే. అతని అభిప్రాయాలే మీకు యిష్టంలేదు"

తనకి యిష్టంలేని ప్రసంగం జరుగుతున్నట్లు కల్పన ముఖం ప్రక్కకి తిప్పుకుంది. "మీకు భాస్కరంటే యిష్టంలేకపోతే, సంసారమే నరకమైతే యిన్నాళ్ళుగా యిక్కడినించి పారిపోవటానికి ప్రయత్నించలేదేం? అతనిని ప్రతిఘటించ లేదేం? అతను చెప్పినట్లల్లా ఎందుకు నడచుకుంటున్నారు?"

"ప్రతిఘటించే శక్తి లేక కాదు. సంసారాన్ని రచ్చకీడ్చుకోలేక. గొడవలూ, గోలా సృష్టించుకోలేక."

''నాతో లేచిపోదామనుకున్నారు. అంతకంటే సంసారాన్ని రచ్చకీడ్చుకోడం, పరువునష్టం ఇంకేదైనా వుందా? భాస్కర్‌ని ప్రతిఘటిస్తే ఏమౌతుంది? ఎప్పుడైనా ప్రయత్నించారా? ఆలోచించారా?"

''ఊహు! లేదు మోహన్. నేనెప్పుడూ ప్రయత్నించలేదు"

''అదే! ఎందుకని? నేను చెప్పనా? మీకు భాస్కరంటే అంతరాంతరాలలో ఎక్కడో యిష్టం వుంది! లేకపోతే మీకిష్టంలేని పనులూ, మీ మనస్సుకు నచ్చనివీ నోరుమూసుకుని అతనికోసం ఎందుకు చేస్తారు? భాస్కర్‌కి అసంతృప్తి కలిగించలేరు. ఎక్కడో హృదయంలోదాగిన మమకారం అడ్డువస్తోంది.'

"కాదు కాదు. మీకర్థంకాదు నాబాధ. నాకింక వేరే మార్గంలేక ఆయన ఆడించినట్టల్లా ఆడుతున్నాను."

"లేదు. మీరతనిని ఎదిరించిచూడండి. అతనేం చేస్తాడు? దెబ్బలాడతాడా? అరుస్తాడా? ఇంకా కోపంవస్తే కొడతాడా? ఇల్లువదిలి పొమ్మంటాడా?– ఇవేమీ జరగవు. మీలాంటి అందమైన మంచి భార్యని వదులుకోడానికి ఏ మగవాడూ యిష్టపడడు. మీరు బాగా ఆలోచించుకోండి. ప్రయత్నంచేసి మీ సంసారాన్ని బాగుపరచుకోండి. అది మీ చేతుల్లోనే వుంది."

కల్పన మాట్లాడలేదు. ఎక్కడికో చూస్తూ కూర్చుంది.

మోహన్ లేచాడు. "క్షమించండి. ఈ మాటలే చెప్పిపోదామని వచ్చాను. నాతో అన్నట్టు మీరింక ఎవరితోనూ అనవద్దు. "మీతో వస్తాను. తీసుకుపోండి" అని, భాస్కర్ మాటలకి, బెదరింపులకీ లొంగిపోకండి. వివేకవంతులై మీ కాపరాన్ని చక్కబరుచుకోండి. వస్తా."

అతను కల్పన జవాబుకోసం ఎదురు చూడలేదు. వెళ్ళిపోయాడు.

మోహన్‌మీద ఎంతో కోపంవచ్చింది కల్పనకి. అతను మంచివాడు. తననిపూవులలో పెట్టి చూసుకోగల అభిమానం వున్నవాడు. స్నేహశీలి. తన హితవు కోరేవాడు. అయినా తనకి చిక్కకుండా దూరంగా వెళిపోతున్నాడు. అతని సాహచర్యం లభిస్తే తన జీవితం సాఫీగా ఒడిదుడుకులు లేకుండా సాగిపోతుంది. కాని తనకా అదృష్టంలేదు. తనను ముళ్ళకంచెలో వదిలి వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిన తర్వాత ఆమె ఎంతో సేపు ఒంటరిగా ఆలోచిస్తూ అక్కడే కూర్చుంది.

ఆ సాయంత్రం ఏడుగంటలకి యింటికి వచ్చిన భాస్కర్‌కి కల్పనలో చాలా మార్పే కనబడింది. ఇద్దరిమధ్యా నిన్నరాత్రి రేగిన కలతా, మనస్పర్థా మరచిపోయినట్టేవుంది. సరదాగావుంది. ఇద్దరూ భోజనంచేసి, ఓసారలా వీధిచివర పార్కులో చల్లగాలికి తిరిగివచ్చారు.

ఇంటికి రాగానే ఆమె స్నానంచెయ్యడానికి స్నానాల గదిలో దూరింది.

భాస్కర్ పేపరు చదువుతూ పక్కమీద వాలాడు. ఇరవై నిమిషాలతర్వాత

కల్పన వచ్చింది. ఆమెతోపాటు చక్కని సెంటువాసనా వచ్చింది.

"లైట్ ఆర్పేస్తా. ఇంక చదువు చాలు" అంటూ లాలనగా అతని చెవి దగ్గర చెప్పి, సుతారంగా అతని చేతిలో పత్రిక లాక్కుంది. పెద్దలైట్ ఆర్పి, నీలం బెడ్‌రూమ్‌లైట్ వెలిగించింది.

కల్పన ప్రక్కన పడుకోగానే రాసుకున్న పౌడరు వాసన అతనికి దగ్గిరగా తగిలింది. ఆమె చెయ్యివచ్చి అతని చెయ్యిని తాకింది. భాస్కర్ కదలలేదు. అతను బిగుసుకు పడుకున్నాడు.

"ఇవాళ ఆస్పత్రికి వెళ్ళివచ్చాను" అంది కల్పన.

"ఎందుకు ?"

"లూప్ పెట్టించుకు రావడానికి" ఆమె సన్నగా నవ్వింది!

"నిజంగా" అంది కల్పన, అతన్ని తాకుతూ పడుకుంటూ. అప్పటికీ అతనిలో చలనంలేదు.

"అరె, మీరిప్పుడు ముట్టుకున్నంతలో ఏమైపోదు అంటున్నాగా ! పిల్లలు పుట్టెయ్యరులెండి. భయపడొద్దు" కిలకిలా నవ్వింది.

అతను మెల్లిగా ఆస్పత్రి వివరాలన్నీ అడిగి తెలుసుకున్నాడు. ఎన్ని గంటలకు వెళ్ళిందీ, ఎప్పుడు వచ్చిందీ-అన్నీ.

తర్వాత భార్యమీద చెయ్యివేసాడు.

"ఇప్పటికి నమ్మకం కలిగిందన్న మాట" అంటూ అతనిని పెనవేసుకుంది కల్పన.

గంట తర్వాత భార్య ముఖంలోకి అనుమానంగా చూస్తూ "నీ మాటలలో నాకు నమ్మకం కుదరటంలేదు" అన్నాడు భాస్కర్.

"పోండి. మీకన్నీ అనుమానాలే" అంటూ నవ్వుతూ, భర్త జుత్తుని ముద్దు పెట్టుకుంది కల్పన.

* * *

రెండునెలల తర్వాత ఓ సాయంత్రం కల్పన ముఖంలో వున్న అంతులేని సంతోషాన్ని చూసి ఆశ్చర్యపోయాడు భాస్కర్.

"ఏమిటి సంగతి ? అంతలా సంబర పడిపోతున్నావ్ ?" అన్నాడు బూట్లు విప్పుకుంటూ.

"ప్రొద్దున్న ఆస్పత్రికివెళ్ళివచ్చాను" నవ్వును దాచుకుంది కల్పన.

"ఎందుకూ ?"

"ఇంక మీరు నన్ను ఎక్కడికి పడితే అక్కడికి యిష్టంవచ్చినట్లు తీసుకువెళ్ళలేరుట"

"అంటే ?"

"మనకో బంధం ఏర్పడుతోంది.'

అతను అర్థంకానట్టు చూసాడు.

"ఇంత మట్టిబుర్ర ఏమిటి? మనింట్లోకి పాప రాబోతూంది" గట్టిగా నవ్వింది.

అతని ముఖం ఎర్రబడింది. "ఇదెలా సాధ్యం ?"

"బాగుంది ! ఎంతమంది దంపతులకి పిల్లలు పుట్టడంలేదు !"

"నన్ను నువ్వు మోసంచేసావుకదూ?"

అఁ.చేసాను. కాని ఆ ముందురోజే ఇకనుంచీ నాయిష్టప్రకారం నాకు నచ్చిన విధంగా నేను నడుచుకుంటానని, చెప్పానుగా! లూప్‌గురించి అబద్ధం చెప్పా. పెళ్ళయి యిన్నాళ్ళయినా మీకు పిల్లలమీద మోజు వుండకపోవచ్చు. నా అందం ఎక్కడ చెడిపోతుందో అని భయం వుండవచ్చు. అలా చెడిపోతే మీ ప్రమోషన్‌లు తొందరగా రావేమోనని అనుమానం వుండవచ్చు. కాని నాకవేం లేవు. మీ డబ్బు, ఉన్నత పదవులూ, నా అందం నాకొద్దు. మనింట్లో ఓ పాప కావాలి. నా ఒంటరితనం పోవాలి. బ్రతకడానికి నాకో ఆశ కావాలి."

* * *

నాలుగేళ్ళు గడిచిపోయాయి. ఓరోజు ఢిల్లీ వెళుతున్న భాస్కర్ గ్వాలియర్ స్టేషన్‌లో దిగి 'టీ' త్రాగుతూవుంటే మోహన్ కనిపించాడు. అతనిని తీసుకుని తన కంపార్ట్‌మెంట్‌లోకి తీసుకువెళ్ళి "కల్పనా, ఎవరు వచ్చారో చూడు" అంటూ భార్యని పిలిచాడు భాస్కర్.

చంటిపిల్లవాడిని ఒళ్ళో జోకొడుతున్న కల్పన మోహన్‌నిచూసి గతుక్కుమంది. కాని ఆ కలవరపాటు ఒక నిమిషమే.

"ఓ మోహన్! రండి, బాగున్నారా ? ఢిల్లీలోనే వుంటున్నారా ?" అంది.

మోహన్ ఆమెకి నమస్కారంచేసి, ఎదురుగా కూర్చున్నాడు. కల్పన అందం ద్విగుణీకృతమైంది. కొద్దిగా ఒళ్ళుచేసింది. కాని ఆమె అందం యిప్పుడు మత్తు గొలపటంలేదు. ఓ గౌరవభావాన్ని కలుగజేస్తోంది.

"పాప పేరేమిటి" అన్నాడు, కిటికీ దగ్గర కూర్చునితననే క్రొత్తగా చూస్తున్న పాపని చూపుతూ.

"దీనిపేరు భావన. వీడిపేరుభారవి" అంది అభిమానంగా పిల్లలిద్దరినీ చూసుకుంటూ.

"వుండండిమోహన్. టీతెమ్మని చెప్పివస్తా" అంటూ వెళ్ళాడు భాస్కర్.

"మీకెంతో కృతజ్ఞురాలిని మోహన్ గారూ. మీరు నా సంసారాన్ని నిలిపారు. మీమీద కోపంకొద్దీ నా సంసారాన్ని దిద్దుకున్నాను. ఇప్పుడు మేం యిద్దరం పిల్లలు సుఖంగావున్నాము" అందికల్పన.

మోహన్ నవ్వి వూరుకున్నాడు.

భాస్కర్ వచ్చాడు. అందరూ టీ తాగారు.

రైలు కూసింది.

"మీరింక వెళ్ళండి మోహన్‌గారూ, మీ ఆవిడ ఎదురుచూస్తూ ఉంటుంది. ఆవిడను మాకోసారి చూపెట్టండి" అంది కల్పన.

"నాకోసం ఎవరూ ఎదురుచూడరు. నాకు పెళ్ళికాలేదు" అంటూ మోహన్ ఆ కంపార్ట్‌మెంట్‌లోంచిదిగి వెళ్ళిపోయాడు.

———